# ఎంపు

కుంటాడి కావేళ జోలి నిండిపోయింది. అది ఆవేళ వాడి అదృష్టం. జోలితో జోలెడు ముష్టి, అంటే రెండు కుంచాల బియ్యం. రేపటి చింతలేని బతుకైనా తొడకి బరువుగా తగుల్తూ, జోలి వేళ్ళాడుతూ ఉంటే కుంటాడి ప్రాణం సంతుష్టితో సుఖపడ్డాది. పది రోజుల గ్రాసం వాడి బుజాన్ని దిగ లాగుతూ వేళ్ళాడుతున్నాది.

కుంటాడు కాలెగరేస్తూ ఊరవతల తోటల్లో కెళ్ళాడు. నెల్లాకు ఎండుపుల్లలు ఏరుకున్నాడు. మూడు మామిడి పింజలు దొంగిలించాడు. సాయంకాలానికి సత్రపు అరుగులు చేరుకున్నాడు. మూటలో మట్టిపిడత తీశాడు. మూడు రాళ్ళ మధ్య నిప్పుచేసి అన్నం ఎసరు పెట్టేడు.

ఎర్రగా పొయ్యినిండా లేచింది మంట. చలితో చుట్టుకుపోయిన కుంటాడి శరీరం వెచ్చపడ్డాది. చుట్టముట్టించి అడ్డపొగ పెట్టేడు. వాడి తొడకానుకొని ఉన్న బియ్యపు జోలిని తణువుకుంటూ తనివితో కళ్ళు అర మోడ్చేడు. అన్నం ఉడుకట్టింది.

"ఎర్రీ!" అని కేక పెట్టాడు. సత్రపు అవతలవ రండాలో ఎర్రి, దాని కుష్టురోగపు తండ్రి కాపరమున్నారు. ఎర్రి వొచ్చింది.

"పులుసుదాకోపాలి యిద్దూ?" అన్నాడు.

"ఏం పులుసురో?" అన్నాది ఎర్రి.

"ఏం పులుసునే, మావిడికాయ నెల్లాకు!"

ఎర్రి పసికట్టింది. కుంటాడి చంకలోంచి దిగి తొడవార గుండ్రంగా మఠం వేసుకొని ఉన్నాది రెండు కుంచాల బియ్యపుమూట. ఎర్రి బుర్రంతా ఆశతో నిండిపోయింది.

"గింజలు బాగా దొరికినాయిర్లో! ఎఖిడి మొకం సూసినావు?" అన్నాది.

"సీకటితో సలిమంట ఏసినారు. ఎఱ్రగా నీ మొకమే సూసినాను" అన్నాడు.

"ఉన్ననాడూ తినవా? ఎదవ నెల్లాకు. సేపలైనా కొన్రా! నానైతే మాంసం కొందును."

"అమ్మో గింజలైపోవు? ఆటితో నేను పదేను రోజులు బతకాలి!"

"రేపు తిరిపెమెత్తవా? జానడు పొట్టకేటోరె? మూడు పిడికిళ్లు దొరికితే సాల్దూ? కొన్రా సేపలు!" అని బలవంత పెట్టింది.

దాని మాటలో ఉన్నాది ముష్టివాళ్ళ ఆర్థిక రహస్యం. మూడు పిడికిళ్ళు దొరికితే చావకుండా బతకొచ్చు! నలుగురమ్మలకి దయగలిగితే పొట్ట నిండిపోతుంది. అదీ ముష్టివాళ్ళ ధీమా! సొట్టాడు లేచాడు. మునిల్దాని కొట్టుకెళ్ళాడు. మునిల్ది ముష్టి ముసాఫర్లకి కిరాణి సామానులు, కూరలు, కంపకట్టలూ అమ్ముతుంది. సోలడు నూకలు వెలపుచ్చుకొని నాలుగెండు చేపల్తోసహా పులుసు సామానిచ్చింది. ఎఱ్ఱి పులుసుదాక తెచ్చింది.

"ఒరే, నే నోటడుగుతాను!" అన్నాది.

"నువ్వడుగుతావని నాకు తెల్సును" అన్నాడు.

"ఏటిరో?"

"బియ్యం!"

"మా యయ్యకి జొరం. మూణ్ణాళ్ళయి ముష్టినేదు."

"నా నియ్యను!"

"ఊరికే అక్కర్నేదురో, నీకాడున్నాయి, బదులియ్యి, లేనినాడు మాకాడుచ్చుకో!"

"నా నియ్యను."

"ఓ రియ్యరా!"

"జటకావోణ్ణడుగు. ఆడంటే నీకు రోకు."

"నీ జిమ్మడ! జటకావోడు నన్నాగ్గిసినాడు."

"నేదు. ఆడు బండి ఎక్కి కుచ్చుల కమిచీతో చలో చలో అంటాడు. ఆడిదగ్గరకెళ్ళు!"

"ఆడికి పెళ్ళయిపోనాది!"

"ఐతే బైరోగోణ్ణడుగు. బైరోగోడిపాటి సేసినాను కాదు ! నా నూకలు కావాలా?"

"ఆ బైరాగోడి సంగతి తెలుసా? వో నా దద్దరేతిరి శిలుం కొట్టి కొట్టి ఒచ్చినాడు. 'ఏటంటావు' అన్నాడు. 'రూపాయి ఇయ్యి' అన్నాను. 'రూపాయి బుర్రా నాది?' అన్నాడు. 'అయితే పోయి శిలుం కొట్టుకో' అన్నాను. అటు సూసినాడు. ఇటు సూసినాడు. మొల్లోంచి తీశాడు. ఇచ్చు రూపాయి. బైరాగోళ్ళు సెడ్డవోళ్ళు. ఆళ్ళకాడ దబ్బుంటాది. నువ్వేటిలా ఇచ్చినావు?"

"నాకాడేటుంది?"

"ఉన్నదే!"

"ఉంటే తగువేమి?"

"ఆ బియ్యమన్నీ వొగ్గేస్తావూ?"

"వొట్టికెళ్ళు. మాట తిరిగితే వొట్టు."

ఆ రాత్రి చీకట్లో కుంటాడు ఎర్రిని పట్టుకొని చెడ్డ బతిమాలేడు. తనూ వాళ్ళతో వుండిపోతాననీ, తనకి గంజినీళ్ళుపోస్తూ ఉండమనీ, తన్ని పెళ్ళాడమనీ పెద్ద పట్టుపట్టేడు. ఎర్రి మెత్తబడ్డాది.

మర్నాడు ఎర్రి, సొట్టాడు కలిసి వొండుకుంటున్నారు. ఎర్రి చేపల పులుసు మళ్ళా పెట్టింది. శైరేతీ సత్రవులో అందరి ముక్కులూ ఎగర గొట్టింది పులుసువాసన. జ్వరంతో పడుకున్న ముసిలాడు లేచాడు.

"ఈ డెవడు?" అనడిగాడు.

"ఇక్కడున్న సొట్టాడే!" అన్నాది ఎర్రి.

"ఎందుకొచ్చినాడూ?"

"కలిసి వొండుకుంటున్నాం."

"కలిశా?"

"ఔను మామా. కలోసుకొన్నాం." అన్నాడు సొట్టాడు. ముసిలాడు ఎర్రగా చూశాడు.

"ఎళ్ళవతలకి సెత్త ఎదవా!" అన్నాడు ముసిలాడు.

"ఎందుకలా కసురుతావు! నానంత సెడిపోయినోణ్ణి కాను." అన్నాడు సొట్టాడు!

"ఓరెరుగుదున్లే్రా జాత్తక్కువ ఎదవా!"

సొట్టాడు పిచ్చెత్తిపోయాడు.

"నాకా జాత్తక్కువ? నాను కాపోళ్ళ కుర్రోణ్ణి. ఏటనుకున్నావో! ఆఁ నీ కూతురు గొప్పయిపోనేదు. జటకావోడితో పోయిన సెటకారీ, ఆ జటకావోడు జొన్నగుడ్డి మాలోడు!" అన్నాడు సొట్టాడు.

ముసిలాడు లేచి పులుసుదాక కాల్తో తన్నేడు. పెద్ద అల్లరి అయి పోయింది. ముష్టివాళ్ళంతా మధ్య పడ్డారు. సొట్టాడు కుంటుకుంటూ వెళ్ళి పోయాడు.

"ఈ ఎదవా దొరికినాడు నీకు? సరియైనవోణ్ణి నానే సూత్తాను" అని ఎర్రికిచెప్పి ఎక్కడికో వెళ్ళిపోయాడు. సొట్టాడు మళ్ళీవొచ్చేడు.

"మీ యయ్యమాటలు ఇన్నావా?" అనడిగాడు.

"నా నేటిసేతును!" అన్నాది ఎర్రి.

"నువ్వు సెయ్యగలిగింది నువ్వు సెయ్యాల!"

"ఏటి సెయ్యమంటావు?"

"నాతోరా!"

"ఎక్కడికి?"

"ఎక్కడికేటి? రామేశ్శరం దరినుంచి అద్దుమాలిన రాజ్జం."

"ముసిలాడు?"

"ఆడేడుపాడేడుస్తాడు!"

"అంటే?"

"వొగ్గేద్దాం!"

"అమ్మ గుండెతీసినోడా? రోగిష్టివోణ్ణే వొగ్గేసి నీతో కులుకుతూ రమ్మంతావూ?"

"నీ కిష్టమైతేనే!"

"ఎళ్ళెళ్ళు" అని కసరి కొట్టింది. ఎర్రి కెదురుగా గోడ మూల గోనె కప్పుకొని గొంగళీ పురుగులాగు చుట్టుకొని సొట్టాడు పడుకున్నాడు.

ఎఱ్ఱి దాకలో అన్నం గంజి వేసి నంచుకోడానికి నాలుగు మిరపకాయలు పెట్టిసొట్టాణ్ణి లేపింది.

"తిండి తిన్రా! మళ్ళా మా యయ్యొస్తే జట్టీ."

"నాను తిన్ను!" అన్నాడు. ఎఱ్ఱి ఎంత బతిమాలినా లేచాడు కాదు.

మునిలాడు వచ్చేడు. వాడితోపాటు గుడ్డివాణ్ణి ఒకణ్ణి తీసుకొచ్చాడు.

"ఎఱ్ఱీ!" అని కేకేశాడు. ఎఱ్ఱి పలికింది.

"ఇయాళ నుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్ళు ఉడకెయ్యాలి. తెలిసిందా? ఆఁ? ఈ గుడ్డోణ్ణెరగవూ?"

"ఎఱ్ఱి గుడ్డివాణ్ణి ఎరుగు. వాడితో వాళ్ళు శ్రీకూర్మం డోలాయాత్ర కెళ్ళారు.

"ఎఱ్ఱీ బాగున్నా?" అని కుశలమడిగేడు గుడ్డివాడు.

"ఏం బాగునే? మునిలోడు మూలపడ్డాడు. అన్నాది ఎఱ్ఱి.

"పెద్దోడయ్యాడు." అన్నాడు గుడ్డివాడు.

"అనాగేనే" అన్నాది ఎఱ్ఱి.

"ఎఱ్ఱీ ఇయాళనుంచి, నువ్వు ముగ్గురికి గంజినీళ్ళు ఉడకెయ్యాలి." అన్నాడు మునిలాడు.

ఎఱ్ఱి మతిపోయింది. పెంచి పెద్దదాన్ని చేసిన తండ్రి శుభ్రమైన కుంటాడు దేహీ అని కాళ్ళ దగ్గరుంటే గెంటేసి గుడ్డివాడికి కట్టిపెట్టడానికి పూనుకొన్నాడు. ఎఱ్ఱికి బోధపళ్ళేదు. ఏమిలాభం? కాదండానికి వీల్లేదు. తండ్రి చెప్పినట్టు నడుచుకోక తీరదు. స్తవు పంచమూలని కుక్కలాగ చుట్టుకొని కుంటాడు పడుకున్నాడు. తిండి తిన్నాడుకాడు. వాడు అడుక్కు తెచ్చిన బియ్యం పెట్టి ఎఱ్ఱి వంటచేసింది. ఎఱ్ఱి దిగాలుపడిపోయింది.

"ఎఱ్ఱీ! నువ్వు ఎఱ్ఱిదానివి. నిజంగా ఎఱ్ఱిదానివి." అన్నాడు మునిలాడు. ఎఱ్ఱికి ఏడుపు వస్తున్నాది.

"ఇనారా ఎఱ్ఱీ!" అని మునిలాడు దాన్ని దూరంగా తీసుకు వెళ్ళాడు.

"సూసినావా గుడ్డోణ్ణి?" అనడిగాడు. చూడకేం? ఎఱ్ఱికి అదివరకే తెలుసు. నల్లగా రాయిలాంటి వొళ్ళు, నుదురునిండా మెరిసిపోతూ నామం!

పేలిన పత్తికాయల్లాగ కిందికి జారిపోతూ గుడ్లు భయమేస్తూ గుడ్డివాడుం టాడు.

"ఆఁ సూసినాను." అని తొడలు వాయించుకొంది.

"నీకు సొట్టోడి మీదున్నాది!" అని వెక్కిరింపు నవ్వునవ్వాడు.

"నా కెవడిమీదా నేదు." అని శూన్యాన్ని చూసింది.

"అనాక్కాదు సెప్పు!"

"నాకు తెల్దు."

"నీకు సొట్టాడు కావాలి!"

"నీ యిష్టమే కానీ."

"అనాగన్నావు బాగుంది. అది నోకం మెచ్చినమాట. నాను సెప్పి నాను ఇనుకో!" అన్నాడు ముసిలాడు. ఇనుకోక తప్పుతుందా! నిల్చో అంటే నిల్చోవాలి. వాడితో వెళ్ళు అంటే వెళ్ళాలి! మనసా ఇష్టంలేని పెళ్ళికూడా వొద్దంటానికి అవకాశం లేదు. తిరుగుబాటు చేయడానికి సత్తువలేదు. చావడానికి సిద్ధంగా ఉన్న ముసిలి కుష్టురోగపు తండ్రితో ఏమున్నాది! పెంచిన తలిదండ్రులకి ఆ అధికారం ఒక్కొక్క పిల్లపైని ఉన్నాది. ఉన్నాది ఒకొక్క పిల్లకి తలిదండ్రులపైనా గౌరవం.

"ఇనుకోక కాదన్నానా?" అన్నాది ఎర్రి.

"ఆడికీ ఈఁడికీ తేడా సెప్పు?" అని అడిగాడు.

"సొట్టోడు సక్కనాగున్నాడు; గుడ్డోడు భయమేస్తున్నాడు."

"నాను భయమేస్తూ నేనూ? కుష్టురోగిని. నన్నెలాగ చూస్తున్నావు? నాకెలాగ సేస్తున్నావు."

"బాగుంది తండ్రివి!"

"నాను తండ్రినని ఇష్టపడ్డావా? ఆడు మొగుడని ఇష్టపడు! సేన్తూ ఒకాడ ఉంటే అదే ఇష్టమౌతుంది. సొట్టాడితో ఇంతకీ దినం ఎళుతుందా?"

"ఎందుకెళ్ళదు?"

"ఎనా గెళుతుంది?"

"మూడు పిడికెళ్ళ ముష్టి దొరకదా?"

"అదిగక్కడే నాను సెపుతున్నాను. ఇనుకో!?" అని ముసిలాడు పెద్ద బోధచేశాడు. ముసిలాడు ఉపన్యాసం ముష్టిలోకానికి ఉపనిషత్తు.

"ఈ ముసిలాడు సచ్చే కాలానికి నన్నడ్దానం చేశాదని నువ్వేదవకు. సొట్టాడితో పెళ్లినావా, నీకు కూడునేదు. అలకించి యాదస్తుంచుకో! ఇవాళ సెప్పినది మళ్లీ పుస్కరానికి సూసుకో! పొట్టాడు ఏ గుమ్మ మెక్కినా మొహంమీద భడీమని తలుపు ఏసుకుంటారు. ఆడి మొకంనూస్తే ముష్టి పలకదు. ఆడు నిన్నట్టుకు బతుకుతాడు. నిన్నాడికీ ఈడికీ కుదిరిసి ఆడు బతుకుతాడు.

"గుడ్డోడు మారాజు. కళ్ళులేని కబోది. ఆడి జనమ కదొక్కటే శాన. అణ్ణి చూస్తే జాలిపుడతాది. ఏ యమ్మేనా మనసు కరిగి ఇన్నిగింజ లేస్తాది.

"అదంతా ఎందుకు? ఆడు అద్దుమాలిన పాటగోడు. ఆడి కెన్నెన్ని పదాలొచ్చును! అణ్ణి సెయ్యట్టుకుని తీసికెళ్లి నాలుగు రోడ్లమధ్య నోవార కూకోయెట్టి, ఆడిముందల గుడ్డ పరిసి నువ్వెళ్ళిపో. ఆడు సితారపట్టుకొని, సిరతలు వోయిస్తూ పాడినాడంటే రూపాయి డబ్బులికి నాగారాదు. నీకదే దాకలా.

"మనిసిని సూసినావా? గునపంనాగున్నాడు. నానాగ పెద్దరోగం, మొండి సేతులూ నేవు. జిరనిసీదడు. ఇంతతెస్తాడు. ఇంత తింటాడు. నీమీద ఆధారపడి నీ సెప్పుసేతల్లో ఉంటాడు.

"నువ్వెక్కడికి యెళ్ళినా ఆడిగినోడుకాదు. సూడరాడు! నీకు మనుసయిందీ, ఇష్టమొచ్చినట్టు తిరుగు. తఖరనేదు....ఏవంటావు?" అనడిగాడు.

"నా నేటంటాను?" అన్నాది ఎర్రి.

"అనాక్కాదు. అణ్ణి వొగ్గకు. నాను బతికుండగా సెప్పుతున్నాను."

"సరేనేపద."

"ఈ బైరేగి సిటికి అందరికీ తెల్దు. నన్నడిగితే ముష్టిగుంటలంతా ఎతికి ఎతికి గుడ్డోళ్ళనే కట్టుకోవాలి."

"పద."

ఇద్దరూ సత్రపు అరుగుమీదికెళ్లారు.

"ఒరే గుడ్డీ! ఎఱ్రి వొప్పుకుంది. అదింకోమాటందు" అని ముసిలాడు చెప్పేడు. గుడ్డివాడు పొంగిపోయాడు. వాడిజన్మకి ఎఱ్రిలాంటి గుంట ఆజన్మాంతం దొరకడమే భాగ్యము.

"ఎఱ్రీ ఇంద. ఇందునోవితీసి రేపు కడేలూ, అందెలూ కొనుక్కో!" అని గుడ్డివాడు మొలగుడ్డల్లో పైకి కనబడకుండా దాచుకొన్న ముంతంత డబ్బులమూట పైకితీశాడు. కానులు, దమ్మిడీలు ఎన్నాళ్లబట్టి కూడబెడుతున్నవో ముంతంత మూటని చేశాడు. అన్ని డబ్బులు ఏ ముష్టివాడిదగ్గ రున్నాయి? ఎఱ్రి కళ్ళు చెదిరిపోయాయి.

"నాకు మెళ్ళోకి ఎఱ్ఱపూసలు కావాలి" అన్నాది. ఎఱ్రికి ఎఱ్ఱపూసలు ఎన్నాళ్ళనుంచో మనసు.

"అయీ కొనుక్కో! కాని సిలవరు కడేలు, అందెలూ కొను. కడేలూ, గాజులూ నేకపోతే ఆడదానికీ, మొగాడికీ ఏటితేడా ? కడేలు సెడ్డ అందం" అన్నాడు గుడ్డివాడు. కళ్ళు లేనివాడికి కడియాల రవ్వలూ గాజుల మోతలే కాబోలు కామాన్ని కదుపుతాయి!

"ఇంక నెగండి కూడుతిని తొంగుందాం" అన్నాడు ముసిలాడు. ఎఱ్రి ముగ్గురికీ కూడు సర్దింది. మూకుడుతో కూడు పెట్టి గంజి నిండా పోసి గుడ్డివాడి కందించింది.

"మా యమ్మకదూ! అద్దిగలాగ ఆడికి దినం ఎళ్ళనీ. నీ సేత్తో ఆడికింత ఎట్టు. ఇద్దరూ నా దినం సచ్చేదాకా ఎళ్ళనీయండి. ఎఱ్రీ నాను బతికుండగా సెపుతున్నాను గుడ్డోణ్ణి వొగ్గకేం?" అన్నాడు ముసిలాడు.